క్లుప్తంగా

ఫ్యామిలీ కౌన్సిలింగ్



డ్రైవర్ల కుటుంబ సభ్యులకు పళ్లు, రవికెలు ఇస్తున్న డిపో మేనేజర్ రమేష్

శృంగవరపుకోట: ఆర్టీసీ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్టీసీ డిపోలో మేనేజర్ కె.రమేష్ నేతృత్వంలో బుధవారం ఆర్టీసీ బస్సు డ్రైవర్ల ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహించారు. డ్రైవర్లకు విధి నిర్వహణలో తీసుకోవాల్సిన, రహదారి భద్రతకు పాటించాల్సిన నియమాలను వివరించారు. డ్రైవర్ల కుటుంబాల్లోని మహిళలకు పండ్లు, రవికెలు అందజేశారు. విధి నిర్వహణకు వెళ్తున్న భర్తలను అన్ని విధాలా సంసిద్ధులను చేసి, వారి శారీరక, మానసిక ప్రశాంతతకు సహకరించాలని కోరారు. బస్సులు నడిపే సమయంలో వారిపై ఎటాంటి ఒత్తిళ్లు లేకుండా ఉండేలా సహకారం అందివ్వాలని కోరారు. ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

సచివాలయంలో తనిఖీలు



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్

దత్తిరాజేరు: మండలంలోని పెదకాద గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ బుధవారం తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది హాజరుతో పాటు వివిధ రికార్డులను పరిశీలించారు. సక్రమంగా విధులు నిర్వర్తించాలని, సమయపాలన పాటించాలని సిబ్బందికి సూచించారు. సమస్యలపై ప్రజలు అందించే వినతులకు త్వరగా పరిష్కారం చూపాలని చెప్పా రు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. కేంద్రాల్లో పౌష్టికాహారం నిల్వలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారం చిన్నారులు, గర్భిణులు,బాలింతలకు సకాలంలో, సక్రమంగా పంపిణీ చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు.

గజపతినగరంలో వైద్యశిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ సుష్మ

గజపతినగరం: స్థానిక గ్రామ సచివాలయం-2లో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ ఆధ్వర్యంలో బుధవారం 104 వైద్యశిబిరం నిర్వహించారు.శిబిరంలో 83మందికి వైద్య సిబ్బందితో కలిసి వైద్యాధికారి వివిధ వైద్యపరీక్షలు చేసి, అవసర మైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శీతాకాలం ముగిసి వేసవి ప్రారంభమవుతోందని వాతావరణ మార్పుల తో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు వైద్యాధికారి అవగాహన కల్పించారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు



విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: పదోతరగతి పబ్లిక్ పరీక్షల సమయంలో విద్యార్థులు అనవసర ఒత్తిడి, ఆందోళనకు గురికావద్దని, ఆత్మవిశ్వాసంతో ప్రశాంతంగా పరీక్షలు రాయా లని ఎంఈఓ బాలభాస్కరరావు సూచించారు. సోంపురం ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. పబ్లిక్ పరీక్షల్లో సులభంగా మార్కు లు సాధించేందుకు పాటించాల్సిన మెలకువలపై పదోతరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు.సమయాన్ని వృథా చేయకుండా శ్రద్ధగా చదువుకోవాలని, పాఠ్యాంశాల్లో ఏమైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకోవాలని చెప్పారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

కేంద్ర బడ్జెట్ ప్రతుల దగ్ధం



బుడతానపల్లిలో బడ్జెట్ ప్రతులను దగ్ధం చేస్తున్న రాంబాబు, రైతులు

గంట్యాడ: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి తగిన కేటాయింపులు చేయలేదని ఆరోపిస్తూ బుడతానపల్లి గ్రామంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి రైతులు నిరసన తెలిపారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్దరాజు రాంబాబు, రైతులు కేంద్ర బడ్జెట్ కాపీలను దగ్ధం చేశారు. ఈసందర్భంగా రాంబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎరువులపై రాయితీ తగ్గిం చిందని మండిపడ్డారు. రైతు సంఘం నాయకులు చల్ల పెంటయ్య, చుక్క అప్పారావు, రొంగలి అప్పలనాయుడు, పొటుపురెడ్డి రామ్మూ ర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు రోడ్డెక్కేదెప్పుడు..?

- ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి సర్కారు
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ప్రభుత్వం నుంచి రాని స్పష్టత
- సూపర్ సిక్స్ పథకాలపై ఆశలు పెంచుకోవద్దని సూచాయగా ప్రకటించిన సీఎం చంద్రబాబు
- ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని తక్షణం అమలు చేయాలని మహిళల డిమాండ్
- గజపతినగరం నియోజకవర్గంలో మహిళా ఓటర్ల సంఖ్య: 1,12,215



దత్తిరాజేరు: అధికారం కోసం ఎన్నికల సమయంలో అన్ని వర్గాలనూ ఆకర్షించేలా పథకాలను ఆ ప్రకటించడం, అధికారం చేతికొచ్చాక వాటిని గాలి కొదలేయడం తనకు అలవాటేనని ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు పదేపదే నిరూపించుకుంటున్నారు. అలవికాని, బూటకపు హామీలు ఇవ్వడంలో ఆరితేరిపోయిన చంద్రబాబు నాయుడు 2014 ఎన్నికల్లో మాదిరిగానే 2024 ఎన్నికల సమయంలోనూ అనేక హామీలు ఇచ్చారు. 2014 లో ఎలా అయితే ప్రజలను నమ్మించి మోసం చేశారో 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే ఫార్ములా ను చంద్రబాబు వాడుతున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వస్తే సూపర్-6 పథకాలను అమలు చేస్తామని ఊరూ వాడా ప్రచారం చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీల అమలు ఊసేలేకుండా పోయింది. సూపర్-6 హామీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అనేది ఒక హామీ. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచే ఉచిత బస్సు ప్రయాణం పథకం అమ లుపై కసరత్తు చేస్తున్నామని మంత్రులు ఓ వైపు ప్రకటనలు ఇస్తుంటే.. ఇదిగో ప్రారంభించేస్తున్నామంటూ కూటమి ఎమ్మెల్యేలు నాయకులు నాలుగైదు ముహూర్తాలను కూడా చెప్పేశారు. కానీ ఇంత వరకు పథకం అమలుపై అతీగతి లేదు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు పూర్తయిందని, అసలు ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలు చేసే ఉద్దేశం ఉందా లేదా అని గజపతినగరం నియోజకవర్గంలోని మహిళలు నిలదీస్తున్నారు.

1.12 లక్షల మంది మహిళల ఎదురు చూపులు

గజపతినగరం నియోజకవర్గంలోని దత్తిరాజేరు, గజపతినగరం,బొండపల్లి, గంట్యాడ మండలాల్లో మహిళా ఓటర్లు భారీగా ఉన్నారు. తాజా లెక్కల ప్రకారం నియోజకవర్గం లో 2,23,328 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,12,215 మంది మహిళలున్నారు.ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేస్తే వీరంతా అర్హులే. నియో జకవర్గంలోని 70 శాతం రూట్లలో గ్రామాలకు ప్రస్తుతం ఆర్టీసీ బస్సు సర్వీసులు ఉన్నాయి. గ్రామాల నుంచి మహిళలు కూలి, వివిధ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు, విద్యార్థినులు కళాశా లలకు నిత్యం ఆర్టీసీ బస్సుల్లో రాక పోకలు సాగిస్తున్నారు. పథకం అమలు చేస్తే ఎంతోమంది లబ్ధిపొందే అవకాశం ఉంది.

హామీ నిలబెట్టుకోవాలి

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామని కూటమి నేతలు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడునెలలు గడిచిపో యింది.పథకం ఎప్పటి నుంచి అమలు చేస్తారో అన్న ప్రకటన కూడా ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి రాలేదు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు అధికారం చేపట్టిన వెంటనే ఉచిత బస్సు పథకాన్ని అమలు చేశాయి. మన రాష్ట్రంలో ఆ ఊసే ఎత్తక పోవడం శోచనీయం. కూటమి ప్రభుత్వం మహిళలకు సమాధానం చెప్పాలి.

– కడుబండి సుధారాణి, దత్తిరాజేరు ఎంపీటీసీ సభ్యురాలు

తక్షణమే అమలు చేయాలి

నియోజకవర్గంతో పాటు జిల్లాలోని పట్టణాలకు గ్రామాల నుంచి మహిళలు కూలిపనులు, వృత్తిపరమైన పనుల కోసం, విద్యార్థినులు కళాశాలలకు నిత్యం ఆర్టీసీ బస్సులలో రాకపోకలు సాగిస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తే వీరందరికీ ఎంతో మేలు జరుగుతుంది. కూటమి నాయకులు ఎన్నికల్లో హామీ ఇచ్చేటప్పుడే ఇది సాధ్యమేనా కాదా అన్న ఆలోచన చేయాలి. అధికారంలోకి వచ్చిన తర్వాత కమిటీలు, కసరత్తులు అంటూ కాలయాపన చేయడం దేనికి. సూపర్-6 పథకాలను అమలు చేయాలంటే భయమేస్తోందని సీఎం చంద్రబాబు, కూటమి నేతలు అనడం సరికాదు. తక్షణమే ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని అమలు చేయాలి.

– మిత్తిరెడ్డి ధనలక్ష్మి, పోరలి గ్రామ సర్పంచ్, దత్తిరాజేరు మండలం

జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



కళ్లేపల్లి గ్రామంలో ఈనెల 12,13వ తేదీల్లో సదానందేశ్వర విజయకేశవస్వామి తీర్థం నిర్వహించనున్న నేపథ్యంలో ఉత్సవ కమిటీ జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేసింది.ఈపోటీలను గ్రామంలోని హైస్కూల్ మైదానంలో స్కూల్ కమిటీ చైర్మన్ బి.అక్కునాయుడు బుధవారం ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 32 జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయని, విజేత జట్టుకు రూ.10 వేల నగదు బహుమతి అందజేయనున్నట్లు నిర్వాహకులు గురి ముత్యాల నాయుడు తెలిపారు. తొలిరోజు కళ్లేపల్లి, చందులూరు గ్రామాల మధ్య జరిగిన పోటీలో చందులూరు జట్టు విజయం సాధించింది. – లక్కవరపుకోట

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నామని గజపతినగరం బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం చిప్పాడ రమేష్‌కుమార్ తెలిపారు. పాఠశాలలోని విద్యార్థినులకు బుధవారం మాక్ టెస్ట్ నిర్వహించారు. అంతకుముందు విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పబ్లిక్ పరీక్షలు అనగానే చాలామంది విద్యార్థులు అనవసరంగా ఒత్తిడికి గురవుతారని, ఒత్తిడిని అధిగమిస్తేనే ఉత్తమ ఫలితాలు సాధించగలరని హెచ్‌ఎం చెప్పారు. పాఠశాలలో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో చదువుతున్న విద్యార్థినులు 80మంది ఉన్నారని, ప్రతీ ఒక్కరిపై ప్రత్యేక శ్రద్ధపెట్టామన్నారు. – గజపతినగరం

అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని చీపురుపల్లి సీఐ జి.శంకరరావు సూచించారు. మానవీయత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చీపురుపల్లిలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, డ్రగ్స్ నియంత్రణ, రోడ్డు భద్రతపై బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు ఖాతా, ఇత ర వివరాలు అడిగితే రెస్పాండ్ అవ్వకూడదన్న విషయం అందరికీ తెలిసినప్పటికీ అప్రమత్తంగా లేకపోవడంతోనే సైబర్ నేరాలకు గురవుతున్నట్లు చెప్పారు. తెలియని వ్యక్తుల నుంచి ఎలాంటి ఫోన్లు వచ్చినా మాట్లాడకూడదని, ఇదే విషయాన్ని ప్రతి ఒక్కరికీ చెప్పాలన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితాలు నాశనమైపోతాయని హెచ్చరించారు. గంజాయి వినియో గించినా, రవాణా చేసినా నేరమేనన్నారు. 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న వారు వాహనాలు నడపరాదని, 18 ఏళ్లు దాటిన తర్వాత లైసెన్స్ పొందిన వారు మాత్రమే వాహనాలు నడపాలన్నారు. ఎస్ఐ ఎల్.దామోదరరావు, మానవీయత సంస్థ అధ్యక్షుడు బి.వి.గోవిందరాజులు, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వినోద్‌బాబు పాల్గొన్నారు. – చీపురుపల్లి

సస్యరక్షణతో మామిడిలో అధికదిగుబడి



చీపురుపల్లి: పేరిపిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న హెచ్ఓ చంద్రశేఖర్



వేపాడ: వీలుపర్తిలో రైతులకు సూచనలు చేస్తున్న హెచ్ఓ పద్మ

చీపురుపల్లి/ వేపాడ: ప్రస్తుతం మామిడి పంట పూత నుంచి పిందె దశకు చేరుకుంటోందని, అధిగ దిగుబడులు సాధించాలంటే సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందని ఉద్యానవనశాఖాధికారులు సీహెచ్.చంద్రశేఖర్, పి.పద్మ అన్నారు. మామిడిపంట సస్యరక్షణపై చీపురుపల్లి మండలంలోని పేరిపి గ్రామ రైతులకు హెచ్ఓ చంద్రశేఖ ర్, వేపాడ మండలంలోని వీలుపర్తిలో రైతులకు హెచ్ఓ పద్మ బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం మామిడి పంటలో బంగి నపల్లి, సువర్ణరేఖ రకాలు తెల్లపూత దశ నుంచి పిందెలు ఆవగింజ సైజుకు చేరుకుంటున్నాయని, పణుకులు రకాలు కూడా పిందె దశకు చేరుకుంటున్నాయన్నారు. విపరీ తంగా మంచు కురుస్తుండడంతో పూతకు నష్టం రాకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. తేనె మంచు, తామర పురుగు ఉధృతి నివారణకు ట్రాక్టర్ ట్యాంకర్ (3వేల లీటర్లు) నీటిలో థయోమిథా క్యామ్ మందును 1.5 కిలోలు, మైక్లోబ్యూటానిల్ మందు 1.5 కిలోలు, ప్లానోఫిక్స్ 750 మిల్లీ లీటర్లు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే మామిడి కాయ తొడుగులు వినియోగించడం ద్వారా నాణ్యత పెరగడంతో పాటు ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. మామిడి కాయ తొడుగులు వినియోగించుకునే రైతులకు ఎకరానికి రూ.4 వేల రాయితీ ప్రభుత్వం అందజేస్తుందన్నారు. మామిడి రైతులు రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడి మార్కెటింగ్ చేసుకోవాలన్నారు.

దరఖాస్తుల స్వీకరణకు గడువు పెంపు

చీపురుపల్లి/గజపతినగరం/ కొత్తవలస: కల్లు గీత కార్మికులకు కేటాయించిన మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించినట్టు చీపురుపల్లి, గజపతినగరం, కొత్తవలస ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐలు చక్రవర్తి, జె.జనార్ధనరావు,జి.ఎస్.రాజశేఖర్ నాయుడు బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ చీపురుపల్లి,గజపతినగరంసర్కిల్ పరిధి గరివిడి, మెరకముడిదాం, గజపతినగరం,కొత్తవలస మండలాలకు కేటాయించిన దుకాణాల కోసం ఇటీవల విడుదలైన నోటిఫికేషన్‌లో ఫిబ్రవరి 5 వరకు దరఖాస్తుల స్వీకరణ గడువు ఉండగా తాజాగా ఈనెల 8వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తులను 8వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా ఎక్సైజ్ స్టేషన్‌లలో అందజేయాలని సూచించారు. అలాగే దుకాణాల కేటాయింపునకు ఫిబ్రవరి 7న నిర్వహించాల్సిన లక్కీడ్రాను 10వ తేదీకి వాయిదా వేసినట్లు స్పష్టం చేశారు.

కార్మికులను బానిసలుగా చేసే కుట్ర

చీపురుపల్లిరూరల్(గరివిడి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, లేకుంటే ఉద్యమాలను ఉధృతం చేస్తామని సీఐటీయూ మండల కార్యదర్శి అంబల్ల గౌరినాయుడు హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లను తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ గరివిడిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం ఆందోళన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 42 కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం రద్దు చేసి కార్మికులను యజమానులకు బానిసలుగా చేసే కుట్రతో వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని మండిపడ్డారు. ఈలేబర్ కోడ్‌ల వల్ల కార్మికులు యజమానులకు బానిసలుగా మారాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు యూనియన్ పెట్టుకునే స్వేచ్ఛ,సమ్మె చేసే హక్కు లేకుండా చేసి, యాజమాన్యానికి మాత్రం వారి ఇష్టానుసారం లేఆఫ్‌లు, లాకౌట్స్ ప్రకటించుకునే హక్కు కల్పించడం ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. కార్మికుల స్వేచ్ఛకు, కష్టానికి నష్టం కలిగించే లేబర్‌కోడ్‌ను మోదీ ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని కోరారు. జిల్లా మైన్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు పిసిని అప్పలనాయుడు, కర్ణ సన్యాసినాయుడు, సేనాపతి పాపినాయుడు, రమణ, ప్రకాష్, ముఖేష్‌సింగ్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా...ఉత్సాహంగా



దౌడు తీస్తున్న గుర్రం



సంగిడీ రాయి ఎత్తుతున్న వస్తాదు

వేపాడ: జాకేరు గ్రామంలో పైడమ్మ,చిన్నమ్మ తల్లి పేరంటాల తీర్థ మహోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహించిన గుర్రాల పరుగు ప్రదర్శన, సంగిడీ రాళ్ల పోటీలు ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగాయి. గుర్రాల పరుగుపోటీల్లో విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలకు చెందిన 18 గుర్రాలు పాల్గొన్నాయి. ఎల్.కోటకు చెందిన సింగపూర్ సత్యనారాయణ, సత్యమ్మతల్లి శక్తి గుర్రం మొదటిస్థానంలో నిలిచింది. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన గుర్రాలకు సంబంధిం చిన యజమానులకు నగదు బహుమతులు అందజేశారు.

సత్తాచాటిన వస్తాదులు

సంగిడీ రాళ్ల పోటీల్లో విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలకు చెందిన పలువురు వస్తాదులు పోటు, తీత, ఇసురు విభాగాల్లో సత్తాచాటారు. మూడు విభాగాల్లోనూ అంబటివలసకు చెందిన వెంకటేష్ ప్రథమ స్థానంలో నిలిచారు. ఆయా విభాగాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి సర్పంచ్ బుద్ధాచిన్నమ్మలు, గ్రామపెద్ద అప్పలనాయుడు, ఎంపీటీసీ టి.వి.రమణ, తదితరులు నగదుబహుమతులు అందజేశారు.

గురుకుల పాఠశాల సందర్శన



విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న జిల్లా గురుకుల పాఠశాలల కో-ఆర్డినేటర్ రూపవతి

వేపాడ: బక్కునాయుడుపేట గురుకుల బాలికల పాఠశాలను జిల్లా గురుకుల పాఠశాలల కో-ఆర్డినేటర్ ఎస్.రూపవతి బుధవారం సందర్శించారు. ముందుగా పాఠశాలలోని స్కౌట్స్, గైడ్స్ విద్యార్థినుల గౌరవ వందనం స్వీకరించారు. పాఠశాల ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తరగతిగదులు, అటల్ టింకరింగ్ ల్యాబ్, లైబ్రరీని పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యల ను తెలుసుకున్నారు. పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమయ్యే విధానంపై పదోతరగతి విద్యార్థినులకు సూచనలు చేశారు. విద్యార్థినులు శతశాతం ఉత్తీ ర్ణత సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయినులకు సూచించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ యు.ఉషారాణి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి ఉన్నారు.

సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోండి



అవగాహన కల్పిస్తున్న సెర్ప్ ప్రతినిధులు

చీపురుపల్లి: ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకాన్ని అంతా సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏపీ బి.బంగారమ్మ సూచించారు. మండల మహిళా సమాఖ్య భవనంలో వీఓఏలకు సూర్యఘర్ పథకంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల్లోని సభ్యులు తమ ఇళ్ల పై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసు కోవాలన్నారు.సెర్ప్ ప్రతినిధులు టి.రాజేష్‌వర్మ, బి.వెంకటేష్ మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకంలో మూడు రకాల సోలార్ ప్లాంట్లు ఉన్నాయని చెప్పారు. సోలార్ యూనిట్ ఏర్పాటుకు అవసరమైన పరికరాల కోసం దాదాపు రూ.49,500 నుంచి రూ.78 వేల వరకు కేంద్ర ప్రభుత్వం రాయితీ , బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీతో రుణం కూడా ఇస్తున్నట్లు తెలిపారు.ఏపీఎం ఎస్.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మాక్ డ్రిల్

గుర్ల: అగ్ని ప్రమాదాలు సంభవించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మంటలను అదుపు చేసే విధానంపై ఐఓసీఎల్ కంపెనీ ఆధ్వర్యంలో కలవచర్ల గ్రామంలో అగ్నిమాపక సిబ్బంది బుధవారం మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. డీటీ నారాయణమ్మ మాట్లాడుతూ మండలంలో ఐఓసీఎల్ కంపెనీకి సంబంధించిన పైపులైన్లు ఉన్నాయని, ఆ ప్రదేశాల్లో చెట్లు పెంచడం, బోరులు తీయడం నిషేధమన్నారు. పైపులైన్ నుంచి లీక్‌లు వచ్చినప్పుడు ఆలస్యం చేయకుండా అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.చీపురుపల్లి అగ్నిమాపక అధికారి హేమసుందర్, ఐఓసీఎల్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



కొత్తవలస: కొత్తవలసలో లేబర్ కోడ్ చట్టాలు, బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు



లక్కవరపుకోట: ఎల్.కోటలో లేబర్ కోడ్ చట్టాల పత్రాలను దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు

లక్కవరపుకోట/కొత్తవలస: కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు, 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌కు వ్యతిరేకంగా కొత్తవలస,లక్కవరపుకోట మండలాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నాయకులు బుధవారం నిరసన తెలిపారు. బడ్జెట్, లేబర్ కోడ్ చట్టాల ప్రతులను దగ్ధం చేశారు. వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు, రైతు సంఘం జిల్లా నాయకుడు గొంప కృష్ణమూర్తి మాట్లాడుతూ కొత్త లేబర్ కోడ్ చట్టాలు అమలైతే కార్మికులు యజమానులకు కట్టు బానిసలుగా మారి పోవాల్సి ఉంటుందన్నారు. వెంటనే ఆచట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వ్యవసాయ రంగానికి సంబంధిచి మూడు చట్టాలను తీసుకొచ్చారని, ఢిల్లీ ఎన్నికల నేపథ్యం ఆ చట్టాలను ఇంకా అమలు చేయలేదని, ఢిల్లీ ఎన్నికలు ముగిసాయని, ఇక అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కేంద్రం తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో సామాన్య ప్రజానీకానికి, కార్మికులకు, రైతులకు,ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ఇది కార్మిక, కర్షక వ్యతిరేక బడ్జెట్ అని అన్నారు. ఎల్.కోట సీపీఎం మండల అధ్యక్షుడు తరిణి వెంకటరమణ, పలువురు రైతులు, రిక్షా కార్మికులు,ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.